క్లుప్తంగా

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి వారి తిరునాళ్ల



వెల్దుర్తి: మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో వేంచేసియున్న మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయం 33వ వార్షికోత్సవ వేడుకలు గ్రామస్తులు వైభవోపేతంగా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. అర్చకులు మల్లికార్జునాచారి, పాలంకయ్య చారిలు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

మాచవరం: మండలంలోని సింగరాయపాలెం తండా గ్రామ సమీపంలోని సింగరుట్ల కొండపై వేంచేసిన స్వయంభు సింగరుట్ల నరసింహ స్వామి కల్యాణ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు స్వామివారి కల్యాణ విశిష్టతను భక్తులకు వివరించారు. పిల్లుట్ల, కొత్తగణేశునిపాడు, సింగరాయపాలెం తండా గ్రామాలకు చెందిన దంపతులు పూజా కార్యక్రమాలు చేపట్టారు. పురోహితులు వేద మంత్రాలతో స్వామి వారి కల్యాణం జరిపించారు. పిల్లుట్ల, కొత్తగణేశునిపాడు, సింగరాయపాలెం తండా గ్రామాల ప్రజలు, గ్రామ పెద్దలు స్వామి వారిని దర్శించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కాసు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్..

కల్యాణ మహోత్సవం సందర్భంగా గురజాల ఎమెల్యే కాసు మహేష్‌రెడ్డి, నరసరావుపేట పార్లమెంటరీ సమన్వయకర్త, ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. నిర్వాహకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వారి వెంట మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక నాయకులు ఉన్నారు.

తిరునాళ్ల హుండీ ఆదాయం రూ.29.56 లక్షలు



దుర్గి: అడిగొప్పల నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా ఆది, సోమవారాలలో భక్తులు హుండీలో వేసిన కానుకలు లెక్కించగా రూ.29,56,808 ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ సైదమ్మబాయి తెలిపారు. సోమవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్నాడు జిల్లా దేవదాయ ధర్మదాయ ప్రత్యేక శాఖాధికారి సత్యనారాయణరెడ్డి, ఈవోలు శ్రీగిరిరాజు నర్సింహబాబు, కె.హనుమంతరావు, పి.కృష్ణంరాజు, సాయికుమార్, సైదారావుల ఆధ్వర్యంలో తిరునాళ్ల సందర్భంగా భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకల హుండీ లెక్కింపును పర్యవేక్షించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి 1.50 లక్షలకు పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎస్ఐ ఎస్.కోటయ్య ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని బ్యాంకు అధికారులకు అందజేసి సంబంధిత రసీదును తీసుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలూరి మహేశ్వరరావు, కరాలపాటి సుబ్బారావు, పాండురంగారావు, కలవల వెంకటేశ్వర్లు, ఎస్ఎంఆర్ సిబ్బంది, అర్చక, పరిచారక, నాయీ బ్రాహ్మణులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప నామస్మరణలో దాచేపల్లి



దాచేపల్లి : అయ్యప్ప నామస్మరణతో దాచేపల్లి మారుమోగింది. అయ్యప్పస్వామి జన్మదినం సందర్భంగా అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నారాయణపురం బ్రహ్మనాయుడు ఆడిటోరియంలో పడి పూజ కార్యక్రమం సోమవారం రాత్రి నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరణ చేసిన వేదికపై అయ్యప్పస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసి 18 మెట్లు నిర్మించారు. గురుస్వామి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 18 రకాల అభిషేకాలు స్వామి వారికి చేశారు. నగర పంచాయతీతో పాటు మండల వ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో పడిపూజ కార్యక్రమంలో పాల్గొని అభిషేకాలు తిలకించారు. డప్పు శ్రీను బృందం పాడిన పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అయ్యప్పస్వామి పడిపూజ సందర్భంగా అన్నదానం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నేతలు కొప్పుల సాంబయ్య, మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.

ప్రగతి పథాన పాలువాయి

- అభివృద్ధి, సంక్షేమంతో అలరారుతున్న పాలువాయి
- రూ.90 లక్షలతో ఎస్సీ కాలనీలో సీసీరోడ్లు
- మారిన పాఠశాలల రూపురేఖలు



ఎస్సీ కాలనీలో వేసిన సీసీ రోడ్డు



గ్రామ సచివాలయం



నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులు



రైతు భరోసా కేంద్రం



వైఎస్సార్ హెల్త్ సెంటర్

పాలువాయి(రెంటచింతల): యువ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో పాలువాయి గ్రామం అభివృద్ధికి కేరాఫ్‌గా నిలిచింది. ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సహకారంతో గ్రామానికి చెందిన జెడ్పీ వైస్ చైర్మన్ కొంతిరెడ్డి నర్సిరెడ్డి గ్రామాభివృద్ధికి కృషి చేయడంతో అభివృద్ధి పరుగులు పెట్టింది. గ్రామంలో ప్రస్తుతం జరిగిన అభివృద్ధి పాలువాయి గ్రామ చరిత్రలో ఎప్పుడూ జరగలేదని కుల, మత, రాజకీయాలకు అతీతంగా గ్రామస్తులు ముక్త కంఠంతో చెపుతున్నారు. గ్రామంలోని ఒక్క ఎస్సీ కాలనీలో సుమారు రూ.90 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగింది. పొలం వెళ్లే రహదారులను రూ.50 లక్షల వ్యయంతో అభివృద్ధి చేయడంతో అన్నదాతల కష్టాలు తీరాయి. గ్రామ స్వరాజ్యమే తన కల అని చెప్పిన మహాత్మాగాంధీ ఆశయాన్ని సాకారం చేసిన ఘనత దేశ చరిత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందనే దానికి సాక్ష్యాలు... పేద ప్రజల పిల్లలకు కూడా కార్పొరేట్ విద్యకు దీటుగా నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం. రైతులకు రాయితీపై నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందజేస్తూ, వారిని ఆదుకునేందుకు రైతు భరోసా కేంద్రాలు, క్షేత్ర స్థాయిలోనే అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడంతో పాటు వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థ, మారుమూల ప్రాంతాలలోని ప్రతి పేదవానికి ప్రభుత్వ వైద్యం అందించడానికి వైఎస్సార్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయడం. ఇలా ప్రజలకు అవసరమైన విద్య, వైద్యంతో పాటు అనేక సంక్షేమ పథకాల ద్వారా వారి ఆర్థికాభివృద్ధికి చేయుతనిచ్చిన ముఖ్యమంత్రి దేశ చరిత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే.

అభివృద్ధి, సంక్షేమం ఇలా...

- రూ.3.50 కోట్లతో సీసీ రోడ్లు ఏర్పాటు
- రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం ఏర్పాటు
- రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం
- రూ.20.80 లక్షలతో వైఎస్సార్ హెల్త్ సెంటర్
- రూ.44.80 లక్షలతో జెడ్పీ హైస్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణం, అభివృద్ధి
- రూ.36 లక్షలతో పాఠశాలల్లో అభివృద్ధి పనులు
- రూ. 28 లక్షలతో మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులు
- రూ. 27 లక్షలతో మంచినీటి బోర్లు, మోటార్లు ఏర్పాటు
- రూ.50 లక్షలతో మెటల్ రోడ్లు నిర్మాణం
- రూ.1,72,92,639 డ్వాక్రా మహిళలకు 4 విడతలుగా ఆసరా కింద అందచజేత
- రూ.1,43,81,250 767 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ చేయుత అందజేత

గ్రామాల అభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట...



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుపరిపాలనలో గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేశారు. గతంలో గ్రామంలో చిన్న పని జరగాలన్నా కాలయాపన జరుగుతుండేది. సీఎం జగన్ మంచి మనస్సుతో చేపట్టిన అభివృద్ధి పనుల ద్వారా క్షేత్రస్థాయిలోనే పాలువాయి గ్రామస్తులకు అవసరమైన నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వైద్యం అందుతుంది. పాలువాయి గ్రామంలో కనీవినీ ఎరుగని రీతిలో కోట్ల రూపాలయలతో అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

–కొంతిరెడ్డి నర్సిరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ , పాలువాయి

మా కాలనీలో ఈ అభివృద్ధిని ఊహించలేదు...



నాకు 80 సంవత్సరాలు. ముఖ్యమంత్రి జగన్ సుపరిపాలనలో మా కాలనీలో జరిగిన ఈ అభివృద్ధిని నేను ఊహించలేదు. ఎప్పుడూ పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వేళ ఒక్క మా ఎస్సీ కాలనీలోనే సుమారు రూ.90 లక్షలతో సీసీ రోడ్లు వేయడం జరిగింది. దీంతో మా కాలనీ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. కుల మతాలకు అతీతంగా గ్రామస్తులందరికీ మేలు జరిగేలా సచివాలయం, ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడం చాలా సంతోషకరం.

– జొన్నలగడ్డ కోటయ్య, గ్రామస్తుడు

అభివృద్ధికి కేరాఫ్ పాలువాయి గ్రామం...



రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత పాలువాయి గ్రామం అభివృద్ధికి కేరాఫ్‌గా నిలిచింది. గ్రామంలో ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సహకారంతో జెడ్పీ వైస్ చైర్మన్ కొంతిరెడ్డి నర్సిరెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులతో గ్రామ ప్రజలకు ఎంతో మేలు జరిగింది. జగనన్న పాలనలో గ్రామాభివృద్ధితో పాటు పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పలు సంక్షేమ పథకాలు అందుతున్నాయి.

– కొక్కెంద్ల బ్రహ్మం, గ్రామస్తుడు

కొత్త హంగులతో తహసీల్దార్ కార్యాలయం



మాచర్ల రూరల్: పాత కుర్చీలు, విరిగిపోయిన బల్లలు, బూజుపట్టిన గోడలు, గరగరమంటూ భారంగా తిరిగే ఫ్యానుతో ఉండే తహసీల్దార్ కార్యాలయం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంగా మారటంతో కార్యాలయం రూపురేఖలు మారిపోయి కార్పొరేట్ ఆఫీసును తలపిస్తుంది. పాత కుర్చీలు పోయి రివాల్వింగ్ చైర్ వేసి, బూజుపట్టిన పై కప్పులకు సీలింగ్, ఏసీని ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు ప్రధాన కేంద్రంగా తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయటంతో, ఇక్కడకు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జిల్లా జాయింట్ కలెక్టర్‌ను నియమించారు. ఎన్నికలకు సంబంధించి అన్ని శాఖల అధికారులు తరచూ సమావేశానికి ఇక్కడికే విచ్చేస్తుంటారు. రిటర్నింగ్ అధికారి నిరంతరం ఎన్నికల పర్యవేక్షణ చేసేందుకు కార్యాలయాన్ని తీర్చిదిద్దారు. వీటితో పాటు సీసీ కెమెరాలను లోపల, బయట ఏర్పాటు చేయటం గమనార్హం. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు, ఇతర శాఖాధికారులు అబ్బురపాటుకు గురవుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన నాడు నేడు పథకం పనులు గుర్తుకువస్తున్నాయి అంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడా నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి

అచ్చంపేట: గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభ కనబరచిన క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని, క్రీడాకారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తనయుడు నంబూరు కల్యాణ చక్రవర్తి అన్నారు. హోలి పండుగను పురస్కరించుకుని గింజుపల్లిలో జరుగుతున్న బంజార క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్ సోమవారం జరిగాయి. విజేతలకు కళ్యాణ చక్రవర్తి కప్ అందజేశారు. ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు. ఎంపీటీసీ స్వర్ణమ్మ రమేష్ నాయక్, క్రికెట్ క్రీడాకారుడు గోపి పాల్గొన్నారు.

సంక్షేమం కావాలంటే జగన్‌నే గెలిపించుకుందాం



ప్రభుత్వ విప్ పీఆర్కే సమక్షంలో పార్టీలో చేరిన యువకులు, మహిళలు, సంఘాల నాయకులు

- ప్రభుత్వ విప్ పీఆర్కే
- జగన్‌కు జే జేలు పలికిన 31వ వార్డు ప్రజలు
- 100 మంది ప్రభుత్వ విప్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిక

మాచర్ల: రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో పాటు పేద వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న విషయాన్ని పేదలంతా తెలుసుకొని సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జే జేలు పలకటం ఎంతో ఆనందకరమని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో 31వ వార్డుకు చెందిన 100 మంది బహుజన పోరాట సమితి నాయకులు కందుకూరి మధు ఆధ్వర్యంలో మద్దతు పలికి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ పేదల వ్యతిరేకి అయిన చంద్రబాబును ప్రతి ఒక్కరూ వ్యతిరేకించి ఆయనను మరింత చిత్తుగా ఓడించాలన్నారు. పొత్తుల పేరుతో ప్రజలను, ఎస్సీ, ఎస్టీలను మోసం చేయటంలో ముందంజలో ఉన్నారన్నారు. మోసగాళ్లైన ప్రతిపక్ష నాయకులను వ్యతిరేకిస్తూ సీఎం జగన్‌కు జే జేలు పలకటానికి ముందుకొచ్చిన బహుజన పోరాట సమితి సభ్యులు మూకుమ్మడిగా వైఎస్సార్ సీపీలో చేరటం సంతోషకరమని, వారందరినీ పేరు పేరున అభినందించి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు బోయ రఘురామిరెడ్డి, తురక కిశోర్, ఆయా వార్డు కౌన్సిలర్లు షేక్ కరిముల్లా, వేల్పుల గురవయ్య, షేక్ మస్తాన్, మందా సంతోష్, షేక్ సుభాని, కందుకూరి రత్నరాజు, పాస్టర్ మాచర్ల దానియేలుతో పాటు పార్టీలో చేరిన వారు యలకపాటి పిచ్చయ్య, కోట రాజేష్, మాచర్ల రాజు, మాచర్ల సునిల్, కొమ్ము వందనం, కోట బాబు, పొన్నూరి నరేంద్ర, డి.కిషోర్‌తో పాటు పలువురు మహిళలు భారీ స్థాయిలో పార్టీలో చేరి జగన్‌కు జే జేలు పలికారు.

విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి



గుంటా మణికంఠరెడ్డి(ఫైల్)

రెంటచింతల: మండలంలోని పాత పాలువాయి గ్రామంలో సోమవారం విద్యుత్ ఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన ఘటన జరిగింది. గ్రామానికి చెందిన గుంటా మణికంఠరెడ్డి (33) తన తల్లి వెంకటరమణ తొలి సంవత్సరీకం సందర్భంగా ఇంట్లో ఉన్న నీళ్ల మోటర్ స్విచ్ వేస్తుండగా విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. వెంటనే రెంటచింతలలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తన భార్య సంవత్సరీకం రోజే కుమారుడు మణికంఠరెడ్డి కూడా విద్యుత్ ఘాతానికి గురై మృత్యువాత పడటంతో గుంటా రామిరెడ్డి, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తుండటం పలువురిని కలచివేసింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో మణికంఠరెడ్డి మృతదేహాన్ని సందర్శించి ప్రమాద వివరాలను జెడ్పీ వైస్ చైర్మన్ కొంతిరెడ్డి నర్సిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. మృతుడు మణికంఠరెడ్డికి భార్య రోజా, ఒక కుమారుడు ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.వెంకట నారాయణరెడ్డి తెలిపారు.

విధుల నుంచి వలంటీర్ తొలగింపు

కారెంపూడి: రాజకీయ ప్రచార కార్యక్రమాలలో పాల్గొంటున్న కారెంపూడి 1 సచివాలయ పరిధిలోని 15వ క్లస్టర్ వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న కాలె విజయ్‌ను వలంటీర్ విధుల నుంచి తొలగిస్తూ ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి సోమవారం ఉత్తర్వులిచ్చారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా రాజకీయ కార్యకలాపాలలో పాల్గొంటూ సోషల్ మీడియా ఖాతాను నిర్వహిస్తూ రాజకీయ పోస్టులు పెడుతున్న వలంటీర్ విజయ్‌ను విధుల నుంచి తప్పిస్తున్నట్లు ఎంపీడీఓ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే

మండలాల అధ్యక్షులను ప్రకటించిన పార్టీ కేంద్ర కార్యాలయం



నరసరావుపేట: ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాలోని గురజాల, సత్తెనపల్లి, పెదకూరపాడు, వినుకొండ నియోజకవర్గాల్లోని పలు మండలాలకు పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ మేరకు.. గురజాల నియోజకవర్గంలో...

దాచేపల్లి మండలంలో..

గురజాల నియోజకవర్గంలోని దాచేపల్లి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులుగా బాసిపోగు మరియబాబు, ఎస్టీ సెల్ అధ్యక్షులుగా భూక్య హరికృష్ణనాయక్, బీసీ సెల్ అధ్యక్షులుగా ఉల్లేరు హనుమంతరావు, మహిళా విభాగ అధ్యక్షురాలిగా బొల్లబాపురం సుమతి, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా మాదినపాడు జాని నియమితులయ్యారు.

దాచేపల్లి నగర పంచాయతీలో..

ఎస్సీ సెల్ అధ్యక్షులుగా ముంద్ర శ్రీను, ఎస్టీ సెల్ అధ్యక్షులుగా జగన్నాథం కోటయ్య, బీసీ సెల్ అధ్యక్షులుగా ఓర్సు దుర్గారావు, మహిళా విభాగ అధ్యక్షురాలిగా షేక్ హుస్సేన్‌బీ, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా షేక్ సైదా నియమితులయ్యారు.

గురజాల మండలంలో..

ఎస్సీ సెల్ అధ్యక్షులుగా బిల్లా శ్రీనివాసరావు, బీసీ సెల్ అధ్యక్షులుగా బత్తుల తిమ్మరాజు, మహిళా విభాగ అధ్యక్షురాలిగా గంగిరెడ్డి రామకోటమ్మ, ఎస్టీ సెల్ అధ్యక్షులుగా రామావత్ నరసింహనాయక్, మైనార్టీ సెల్ అధ్యక్షురాలిగా షేక్ నాసర్‌సైదా నియమితులయ్యారు.

గురజాల నగర పంచాయతీలో..

ఎస్సీ సెల్ అధ్యక్షులుగా కన్నెగంటి ఏసోబు, బీసీ సెల్ అధ్యక్షులుగా బత్తుల చిరంజీవి, మహిళా విభాగ అధ్యక్షురాలిగా షేక్ తహిరున్నీసా బేగం, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా షేక్ మీర్‌షా, ఎస్టీ సెల్ అధ్యక్షులుగా చౌతురి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు.

మాచవరం మండలంలో..

ఎస్సీ సెల్ అధ్యక్షులుగా పోలే సైమన్, ఎస్టీ సెల్ అధ్యక్షులుగా నన్‌సావత్ చినకోటేశ్వరరావు, బీసీ సెల్ అధ్యక్షులుగా జంగాల సుదర్శన్, మహిళా విభాగ అధ్యక్షురాలిగా షేక్ మీరాబాయి, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా షేక్ నన్నేషా నియమితులయ్యారు.

పిడుగురాళ్ల మండలంలో..

ఎస్సీ సెల్ అధ్యక్షులుగా ఇనుముక్కల పిచ్చయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షులుగా రామావత్ రామాంజినాయక్, బీసీ సెల్ అధ్యక్షులుగా అద్దంకి శ్రీనివాసరావు, మహిళా విభాగ అధ్యక్షురాలిగా బైరపోగు కుమారి, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా షేక్ మోర్జంపాటి మహమ్మద్ ఖాసీం నియమితులయ్యారు.

పిడుగురాళ్ల మున్సిపాల్టీలో..

ఎస్సీ సెల్ అధ్యక్షులుగా కాలే మాణిక్యాలరావు, ఎస్టీ సెల్ అధ్యక్షులుగా కంద్రకుంట్ల కన్నయ్య, బీసీ సెల్ అధ్యక్షులుగా కందుకూరి శివయ్య, మహిళా విభాగ అధ్యక్షురాలిగా అన్నెం పద్మావతి, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా షేక్ యూసఫ్ జాని (బచ్చా మేస్త్రీ) నియమితులయ్యారు.

మాజీ సర్పంచ్ నాసరయ్య మృతి



మాజీ సర్పంచ్ నాసరయ్య (ఫైల్)

వెల్దుర్తి: మండల పరిధిలోని పట్లవీడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ బాలబోయిన నాసరయ్య (70) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. గ్యాస్ట్రిక్ ట్రబుల్‌తో బాధపడుతూ గుంటూరులో చికిత్స పొందుతున్న నాసరయ్య హార్ట్ అటాక్ రావటంతో మరణించారు. ఆయన మరణం పట్ల పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.

అనుమతులు తప్పనిసరి

ముప్పాళ్ళ: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆయా రాజకీయ పార్టీలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించాలనుకుంటే ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని మండల నోడల్ ఆఫీసర్ ఎస్.సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ కార్యాలయాల ఏర్పాటుకు, వాహనం ద్వారా ప్రచారానికి సత్తెనపల్లిలోని తహసీల్దారు కార్యాలయంలోని ఎన్నికల కౌంటర్‌లో సంబంధిత పత్రాలు సమర్పించి అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా ప్రచారం నిర్వహించడం ఎన్నికల కోడ్‌కు విరుద్ధమని, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తెలిపారు.

ఘనంగా హోలీ పండుగ



రంగులతో హోలీ జరుపుకుంటున్న చిన్నారులు



హోలీ వేడుకలలో చిన్నారులు

పిడుగురాళ్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో చిన్నా, పెద్ద తేడా లేకండా హోలీ పండును రంగులతో ఘనంగా సోమవారం నిర్వహించుకున్నారు. 6వ వార్డులో, శ్రీనివాసకాలనీలో, ప్రజాశక్తి నగర్, తహసీల్దార్ కార్యలయం వెనుక బజర్‌లో, మాయా బజార్‌లో, జానపాడు రోడ్డులోని పలు ప్రాంతాల్లో రంగుల కేళి హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. కుమ్మరిపాలెం, నారాయణ స్కూల్ ప్రాంతాల్లోని చిన్నారుల రంగు నీళ్ల బాటిళ్లతో ఒకరిపై ఒకరు చల్లుకుంటూ ఆనందంగా హోలీ పండుగను జరుపుకున్నారు. శ్రీనివాస కాలనీ తండాలో సుగాలీ మహిళలు రంగులు చల్లుకుంటూ హోలీని జరుపుకున్నారు. విద్యార్థులు, స్నేహితులు, ఇరుగుపొరుగు వారు రంగులు చల్లుకంటూ హోలీని వైభవంగా జరుపుకున్నారు.

గురజాలలో ఉత్సాహంగా హోలీ

గురజాల : హోలీ పండగను చిన్నా పెద్ద తేడా లేకుండా సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. హోలీ పురస్కరించుకుని యువతీయువకులు చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని ఉత్సాహంగా గడిపారు. రంగులు పూసుకుంటూ ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలో పలువురు మార్వాడీలు, సుగాలీలు హోలీ సంబరాల్లో పాల్గొన్నారు.


దాచేపల్లిలో..

దాచేపల్లి : హోలీ పండుగ వేడుకలు సోమవారం జరిగాయి. పండుగ సందర్భంగా యువతీ, యువకులు గులాములు చల్లుకుంటూ సందడి చేశారు. సుగాలీలు అధికంగా ఉన్న భట్రుపాలెం, కొత్తూరు, శంకరపురం గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు, యువతీ, యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. సర్పంచ్‌లు భుక్యా కొండనాయక్, శ్రీనునాయక్, ఎంపీటీసీ రెడ్యా నాయక్‌ల పర్యవేక్షణలో పలు సేవ కార్యక్రమాలు చేపట్టారు.

రెంటచింతలలో హోలీ వేడుకలు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం హోలీ వేడుకలు చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా రంగులను, నీటిని ఒకరిపై ఒకరు చల్లుకుంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకున్నారు. హిందూ సోదరులు వసంత రాకను ఆనందకరమైన రంగులతో హోలీ వేడుకలు జరుపుకుంటారని స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు తెలిపారు. రెంటచింతల, రెంటాల, మిట్టగుడిపాడు, జెట్టిపాలెం, గోలి తదితర గ్రామాలలో హోలీ ఆనందంగా జరుపుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మతల్లి నెల తిరునాళ్ల



అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లులో స్వయంభుగా వెలసిన గంగాదేవి పేరంటాళమ్మ నెల తిరునాళ్ల మహోత్సవాలు సోమవారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా మాఘ శుద్ధ పౌర్ణమి రోజు అమ్మవారికి తిరునాళ్ల నిర్వహించి, మరుసటి నెలలో పౌర్ణమినాడు నెల తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, అష్టోత్తర శత నామార్చనలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి, తల నీలాలకు, వస్త్రాలు విక్రయాలకు, ప్రసాదానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అచ్చంపేట సీఐ షేక్ కరిముల్లాషావలి ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.